క్లుప్తంగా

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు వైదా వేద్య, ప్రహర్షిత

బీచ్ రోడ్డు: సాగరతీరంలోని అన్నమయ్య వేదిక వద్ద ఆదివారం తారకేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. ఎన్ఎన్‌వీ సత్యభామ శిష్యులు వైదా వేద్య, ప్రహర్షిత తమ నృత్య ప్రదర్శనలతో అలరించారు. అనంతరం శాస్త్రీయ నృత్య పోషక్ ఉపాహారం అవార్డులతో నృత్యకారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యుడు ఇంద్ర మోహన్, స్వామి జ్ఞాన ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ వెళ్లి పింఛన్ అందజేత



కాకినాడ వెళ్లి మహ్మద్ గౌసియా బేగంకు పింఛన్‌ను అందిస్తున్న వార్డు వెల్ఫేర్ సెక్రటరీ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–4 పరిధి 38వ వార్డుకు చెందిన మహ్మద్ గౌసియా బేగం గత కొంతకాలంగా మూత్ర పిండాల వ్యాధితో బాధ పడుతున్నారు. ఆమె చికిత్స కోసం కాకినాడలో ఉంటున్నారు. ఇటీవల ఆమె డయాలసిస్ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఇటీవల మంజూరైన నూతన పింఛన్లలో ఆమె పేరుంది. ఈ నెల పింఛన్ తీసుకోక పోతే వెనక్కి వెళ్లిపోయే అవకాశం ఉంది. దీంతో వార్డు వెల్ఫేర్ సెక్రటరీ ముత్యాల రామకృష్ణ కాకినాడలో ఉంటున్న మహ్మద్ గౌసియా బేగం వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము రూ.10వేలు అందజేశారు. రామకృష్ణకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

వరదరాజస్వామిగా దర్శనమిచ్చిన అప్పన్న



వరదరాజస్వామి అలంకరణలో అప్పన్న

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వరదరాజస్వామిగా దర్శనమిచ్చాడు. స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని వరదరాజస్వామిగా అలంకరించి శ్రీదేవి,భూదేవి సమేతంగా పల్లకిలో వేంచేయజేశారు. ఆళ్వారులను మరో పల్లకిలో అధిష్టంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. అర్చకుడు కుమారాచార్యులు పాల్గొన్నారు.

అపోలోలో ఉచిత వైద్య శిబిరం



మహిళ మోకాళ్లను పరిశీలించి కీళ్ల నొప్పులు గురించి వివరిస్తున్న డాక్టర్ నవీన్

ఆరిలోవ: స్థానిక హెల్త్ సిటీలోని అపోలో ఆస్పత్రిలో ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు డాక్టర్ నవీన్ ప్లా ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆర్థ్రైటిస్, కీళ్ల మార్పిడిపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఉచితంగా కీళ్ల వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేసి ఎక్స్‌రేలు తీశారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ల సహకారంతో పరిశుభ్రత

- మేయర్ హరివెంకటకుమారి
- ముడసర్లోవలో ఘనంగా పిక్నిక్



శానిటరీ ఇస్పెక్టర్ల పిక్నిక్‌లో మాట్లాడతున్న మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: నగర పరిశుభ్రతలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ల సహకారం ఎంతో ఉందని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. నగరంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ల అసోసియేషన్ వన భోజన కార్యక్రమం ఆదివారం ముడసర్లోవ పార్కులో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నిత్యం వార్డులో విధుల్లో ఉంటూ పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తున్నారన్నారు. వీరి సహకారంతోనే స్వచ్ఛ సర్వేక్షణలో నగరం నాలుగో స్థానంలో నిలిచిందన్నారు. ఈ సారి ఒకటి, రెండు స్థానాలలో నిలవడానికి తగిన కృషి చేయాలని ఆమె సూచించారు. ఈ ఏడాది మార్చిలో జరగనున్న జీ–20 సదస్సుకు 40 దేశాల నుంచి ప్రతినిధులు నగరానికి రానున్నారన్నారు. ఆ సమయంలో విదేశీ ప్రతినిధులకు ఆహ్లాదం కలిగించే విధంగా నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దే బాధ్యతతో పని చేయాలని ఆమె ఇన్‌స్పెక్టర్లకు సూచించారు. పారిశుధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ సన్యాసిరావు, సీఎంవో డాక్టర్ శాస్త్రి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వాకర్స్ ఇంటర్నేషనల్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సుంకరి రవీంద్ర, తదితరులు

ఎంవీపీ కాలనీ: వాకర్స్ ఇంటర్నేషనల్ 2023 క్యాలెండర్‌ను సంస్థ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు సుంకర రవీంద్ర ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎంలో ఆదివారం వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా ఉప్పలపాటి శుభ ప్రమాణ స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023 క్యాలెండర్ ఆవిష్కరణ చేశారు. అనంతరం సుంకరి రవీంద్ర మాట్లాడుతూ 1987లో దివంగత సుంకర ఆళ్వార్‌దాస్ ఏర్పాటు చేసిన వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిందన్నారు. 1350 శాఖలుగా ఏర్పడి సమాజానికి విశేష సేవలందిస్తోందన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా ప్రమాణం చేసిన ఉప్పలపాటి శుభను ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు అభినందించారు.

సందడిగా జర్నలిస్టుల క్రికెట్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: జర్నలిస్టుల స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. పోర్ట్ స్టేడియంలో ఆదివారం జరిగిన సెమీస్ పోటీలను బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీ.వి.ఎల్.నరసింహారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు ఆట విడుపు అవసరమన్నారు. తొలి సెమీస్‌లో కెమెరామెన్ జట్టు 31 పరుగుల తేడాతో సాక్షి జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన కెమెరామెన్ జట్టు ఏడు వికెట్లకు 151 పరుగులు చేయగా.. దుర్గా, సుధీర్, నవాజ్ రెండేసి వికెట్లు తీశారు. సాక్షి జట్టు ఏడు వికెట్లే కోల్పోయినా.. 120 పరుగులకు ఇన్నింగ్స్ ముగించింది. దుర్గా 34 పరుగులు, సుధీర్ 20 పరుగులు చేశారు. కెమెరామెన్ ప్రేమ్‌కుమార్ మూడు వికెట్లు తీసి మ్యాచ్ బెస్ట్‌గా నిలిచాడు. వీజేఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏపీ మారిటైం బోర్డ్ చైర్మన్ కాయల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గణేష్ యూత్ క్రికెట్ టోర్నీ



క్రికెట్ టోర్నమెంట్‌లో విజేత జట్టును అభినందిస్తున్న లీలాసుందరి నగర్ కమిటీ సభ్యులు

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో లీలాసుందరయ్యనగర్ గణేష్ యూత్ ఆధ్వర్యంలో సీజన్–3 క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ఉత్సాహంగా జరిగింది. నగరంలో పోలీస్ బ్యారెక్స్ మైదానంలో నిర్వహించిన ఈ టోర్నీలో నాలుగు జట్లు తలపడ్డాయి. వాటిలో లీలాసుందయ్యనగర్‌కు చెందిన ప్రదీప్ జట్టు విజయం సాధించింది. ఈ సందర్భంగా విజేత జట్టుకు లీలాసుందయ్యనగర్ కమిటీ అధ్యక్షుడు ఏడువాక సన్యాసిరావు, సభ్యులు ట్రోఫీ అందజేసి అభినందించారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి సందర్భంగా యువకులకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి పోత్సహిస్తున్నట్టు సన్యాసిరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ ట్రెజరర్ కర్రి కృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

మద్దిలపాలెంలో ఆర్ట్ గ్యాలరీ ప్రారంభం



ఆర్ట్స్ గ్యాలరీని ప్రారంభిస్తున్న ప్రముఖ ఆర్టిస్ట్

మద్దిలపాలెం: ప్రకృతి అందాలను తన కుంచెతో అద్భుత చిత్రాలను ఆవిష్కరించారు చిత్రకళాకారుడు రాజుబాబు. మద్దిలపాలెం భానునగర్ కాలనీలో సంపత్ ఆర్ట్ గ్యాలరీని ఆదివారం ఏయూ ఫైన్ ఆర్ట్స్ విశ్రాంత ఆచార్యుడు రవీంద్రరెడ్డి ప్రారంభించారు. పల్లె పడుచుల జీవన శైలి, వ్యవసాయ జీవనంపై గీచిన చిత్రాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శన ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకూ అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు



యజ్ఞోపవీతాన్ని సమర్పిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7గంటల నుంచి స్వామికి స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలకు పుష్పాలంకరణ చేసి ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేసి 108 స్వర్ణ తులసీ దళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు పూజ నిర్వహించారు. ఆలయ ఏఈవో నరసింహరాజు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను కల్యాణమండపంలో అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు,ప్రసాదం అందజేశారు.ఆలయ ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు తదితరులు కల్యాణం నిర్వహించారు.

పాతనగరానికి పండగ శోభ



చెప్పల దుకాణాల వద్ద కొనుగోలుదారులు



పోలీస్ బ్యారెక్స్ వద్ద జనం

కిక్కిరిసిన జగదాంబ జంక్షన్, రోడ్లు

డాబాగార్డెన్స్/జగదాంబ: పాతనగరం పండగ శోభ సంతరించుకుంది. సంక్రాంతి ముందు వచ్చిన ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో కొనుగోలు దారులు జగదాంబ జంక్షన్‌కు రావడంతో పెద్ద షాపింగ్‌మాల్స్‌తోపాటు ఫుట్‌పాత్ మార్కెట్ కూడా కళకళలాడింది. డాబాగార్డెన్స్ మెయిన్‌రోడ్డులో గల షాపింగ్ మాల్స్‌తోపాటు వస్త్ర దుకాణాలకు కొనుగోలుదారులు క్యూ కట్టారు. ఓ వైపు సెల్‌దుకాణాలు, మరోవైపు వస్త్ర దుకాణాలకు జనం క్యూ కట్టడంతో డాబాగార్డెన్స్ మెయిన్‌రోడ్డుతోపాటు పలు ప్రాంతాలు కిటకిటలాడాయి. ముఖ్యంగా పోలీస్ బ్యారెక్స్, పందువుల్లల వస్త్ర దుకాణాల వద్ద ఇసుక వేస్తే రాలనంత జనం ఉంటున్నారు. నిత్యావసర సరకుల కొనుగోలు దుకాణాలు, పిండి మిల్లుల వద్ద జనం క్యూ కట్టారు. జగదాంబ నుంచి పూర్ణామార్కెట్ వరకు పరిసర ప్రాంతాలల్లో వ్యాణిజ్య సముదాయలన్నీ బిజీగా ఉండడంతో ఏ రోడ్డు కూడా ఖాళీగా ఉండడం లేదు. ఇదే అదునుగా జేబు దొంగలు రెచ్చిపోతున్నారు. అయితే పోలీసులు కూడా ముందస్తుగా ఆటోలు, జీపులు ద్వారా జేబుదొంగలు ఉన్నారంటూ ప్రచారం చేస్తున్నారు. మరికొందరు పోలీసులు మఫ్టీలో నిఘా కాస్తున్నారు.

ట్రాఫిక్‌తో ఇబ్బందులు : మరోవైపు జగదాంబ జంక్షన్‌కు వెళ్లాలంటే ముప్పుతిప్పలు పడాల్సి వస్తోందని నగరవాసులు బెంబేలెత్తిపోతున్నారు. ఇసుక వేస్తే రాలనంతగా జనం తరలిరావడంతో ఇటు పాదచారులు, వాహనచోదకులు జంక్షన్‌కు వెళ్లాలన్నా... జంక్షన్ మీదుగా కేజీహెచ్, కలెక్టర్ కార్యాలయం, బీచ్‌కు పోవాలన్నా... టర్నర్‌చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, టౌన్‌కొత్తరోడ్డుకు వెళ్లాలన్నా అవస్థలు పడాల్సి వస్తోంది. ట్రాఫిక్ రద్దీని నియంత్రించడంలో ట్రాఫిక్ పోలీసు లు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. జగదాంబ పరిసర ప్రాంతాల్లో ఉన్న గల్లీలన్నీ వాహనాల పార్కింగ్‌తో పూర్తిగా నిండాయి. మసీదు జంక్షన్, ఎల్లమ్మతోట, కేజీహెచ్ అప్‌రోడ్డు, దేవరవీధితో పాటు జగదాంబ జంక్షన్, లేపాక్షి జంక్షన్, ప్రకాశరావుపేట జంక్షన్ తదితర ప్రాంతాలన్నీ ద్విచక్ర, కార్ల పార్కింగ్‌తో నిండిపోయాయి.

బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పేరుతో టోకరా

- మిథిలాపురి వుడా కాలనీలో రూ.20 వేలు వసూలు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు మిథిలాపురి వుడా కాలనీలో భవనంపై అదనపు స్లాబు వేయాలని భావిస్తున్న ఇంటి యజమాని నుంచి ఓ వ్యక్తి జీవీఎంసీ బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పేరుతో రూ.20 వేలు వసూలు చేసి పరారయ్యాడు. దీనికి సంబంధించి బాధితుడు, మిథిలాపురి వుడా లే అవుట్స్ నివాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు త్రిమూర్తులు రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీలో ఉన్న అపోలో డయాగ్నోస్టిక్స్ భవనంపై అదనపు స్లాబు వేయించాలని నిర్ణయించుకున్నారు. దీని కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ విషయం తెలుసుకుని ఓ వ్యక్తి ఆయన దగ్గరకి వచ్చి తాను కొత్త బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌ను అని, తన పేరు దాట్ల శ్రీనివాసరాజు అని చెప్పి నమ్మించాడు. అన్నీ చూసుకుంటానని, ఫిబ్రవరి 5 నుంచి పనులు కూడా చేసుకోమని, పైగా భవన యజమానికి చెందిన బంధువులు, మిత్రుల పేర్లు ఒకటీ రెండు చెప్పడంతో నిజమేనని నమ్మారు. రూ.30 వేలు ఇస్తే అనుమతి ఇప్పిస్తానని నమ్మించాడు. దీంతో ముందుగా రూ.20 వేలు ఇచ్చారు. నగదు ఇచ్చిన తర్వాత సచివాలయ సిబ్బందిని వాకబు చేయడంతో అటువంటి పేరు గల వారు ఎవ్వరూ జీవీఎంసీలో లేరని చెప్పారు. దీంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు, జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు ఇస్తానని త్రిమూర్తులురాజు చెప్పారు.

అట్టహాసంగా ధనుర్మాస పూజలు



సింహగిరిపై గోదాదేవికి హారతి ఇస్తున్న అర్చకుడు

సింహాచలం: ధనుర్మాస పూజలు పలు ఆలయాలల్లో అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. సింహగిరితో పాటు పెందుర్తి వెంకటాద్రిపై కొలువైన వెంకన్న ఆలయంలో ఈ పూజలు 24 రోజులుగా అత్యంత వైభవంగా జరగుతున్నాయి. సింహగిరిపై తెల్లవారుజామున స్వామికి సుప్రభాత సేవ అనంతరం విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం, ఉపనిషత్తు పారాయణం, తిరుప్పావై సేవాకాలం నిర్వహించారు. గోదాదేవికి బేడామండపంలో తిరువీధి చేశారు.

ప్రజా ఉద్యమంగా ఉక్కు పోరాటం



దీక్షా శిబిరంలో కూర్చున్న మంత్రి రాజశేఖర్, నిర్వాసితులు

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అని, దానిని ఎలా ప్రయివేటుపరం చేస్తారని మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులు నడుపూరు గాంధీ పార్కు ఎదుట ఆదివారం ఉదయం 8 గంటలకు 24 గంటల నిరాహారదీక్షను ప్రారంభించారు. వీరి దీక్షకు నడుపూరు గ్రామ ప్రజలు, కాంట్రాక్ట్ కార్మికులు, స్టీల్ కార్మికులు, అఖిల పక్షాల కార్మిక సంఘాల నాయకులు, రాజకీయ నాయకులు సంఘీభావం తెలిపారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణపై కేంద్రం ప్రభుత్వం నిర్ణయం వెనక్కి తీసుకునే వరకూ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ పోరాటాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని డిమాండ్ చేశారు.

ఘనంగా హిందుస్థాన్ షిప్‌యార్డ్ కళాశాల స్వర్ణోత్సవాలు

- ఆడిపాడిన పూర్వ విద్యార్థులు



ఏయూ వీసీ ప్రసాదరెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న గోల్డెన్ జూబ్లీ అపెక్స్ కమిటీ ప్రతినిధులు

సింధియా: హిందుస్థాన్ షిప్‌యార్డ్ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. కాలేజీ ఆవరణలో నిర్వహించిన ఈ వేడుకల్లో దేశ విదేశాల నుంచి పూర్వ విద్యార్థులు పాల్గొని నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సందడి చేశారు. ముఖ్య అతిథి షిప్‌యార్డ్ డీసీపీ గుప్తా జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మరో అతిథి ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మాట్లాడుతూ కళాశాల గోల్డెన్ జూబ్లీ అపెక్స్ కమిటీ ప్రతినిధులను అభినందించారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం అతిథులకు జ్ఞాపికలు అందజేసి శాలువాలతో సత్కరించారు. 1,200 మంది పూర్వ విద్యార్థులు సమావేశమై ఆడిపాడారు. వేడుకల్లో అపెక్స్ కమిటీ ప్రతినిధులు డాక్టర్ అప్పారావు, శ్రీనివాసరెడ్డి, శరగడం వెంకట్, గుండుబోయిన మురళీకృష్ణ, ఆనంద్, ఏయూ రిజిస్టర్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి కానుకగా డివిడెండ్ల పంపిణీ

- అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి



మహాజన సభలో మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి

సింహాచలం: సకాలంలో రుణాలు చెల్లించి సొసైటీ అభివృద్ధికి సంఘ సభ్యులంతా సహకరించాలని అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి కోరారు. సొసైటీ మహాజన సభ ఆదివారం అడవివరం ప్రియాగార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మాట్లాడారు. సొసైటీలో పేరుకుపోయిన బకాయిలు చాలా ఉన్నాయని వాటిని రికవరీ చేసేందుకు పాలకవర్గం సమష్టిగా కృషి చేస్తోందన్నారు. ముఖ్యంగా 2015 మార్చి 31వరకు బకాయిలు చెల్లించని వారికి వన్ టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా క్లియర్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నట్టు తెలిపారు. వారి రుణాలను బట్టి 18 శాతం వడ్డీ నిర్ణయించడం జరుగుతుందన్నారు. గ్రాము బంగారానికి ప్రస్తుతం ఇస్తున్న రూ. 3వేల రుణాన్ని రూ. 3,200లకు పెంచుతున్నట్టు ప్రకటించారు. 12 వడ్డీ మాత్రమే బంగారంపై రుణం వసూలు చేయడం జరుగుతుందన్నారు. 2019 మార్చి 31లోపు బంగారు రుణాలు చెల్లించని వారంతా లోన్లు క్లియర్ చేసుకోవాలని, వారందరికీ ఎక్స్‌ట్రా 2 శాతం వడ్డీ తగ్గించడం జరుగుతుందని పేర్కొన్నారు. మార్ట్‌గేజ్ రుణాలు రూ. 25లక్షలకు పెంచుతున్నట్టు ప్రకటించారు. సంక్రాంతి కానుకగా ఈనెల 12 నుంచి సభ్యులకు డివిడెంట్లు పంపిణీ చేస్తామని ప్రకటించారు. షేర్‌క్యాపిటల్‌పై 20 శాతం, త్రిఫ్ట్ డిపాజిట్‌పై 8 శాతం కలిపి డివిడెంట్ల రూపంలో చెల్లించడం జరుగుతుందని వెల్లడించారు. కాగా సొసైటీ తరఫున పెట్రోల్‌బంక్, సూపర్ మార్కెట్, గ్యాస్ ఏజెన్సీ నిర్వహించాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు లేబర్ యాక్ట్ వర్తింపజేయాలని మాజీ సభ్యుడు సతివాడ శంకరరావు కోరారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేశ్వరరావు, డైరెక్టర్లు కొలుసు గురునాథరావు, గేదెల కృష్ణం నాయుడు, బోర ప్రసాదరెడ్డి, ఆకుల నాగరాజు, పాలూరి సూరిబాబు, లండ వెంకటరమణ, గునిశెట్టి శ్రీనివాసరావు, కోరాడ ఈశ్వరరావ, పోలవరపు రాజకుమారి, సొసైటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సందడిగా కేరళ ఉత్సవాలు



క్రీస్తు గీతాలాపన చేస్తున్న కేరళ బ్యాండ్ పార్టీ



ఆకట్టుకుంటున్న క్రీస్తు జననం సెట్

మురళీనగర్: నగరంలోని కేరళీయులందరూ క్రిస్మస్‌తోపాటు నూతన సంవత్సర వేడుకలను బిర్లా కూడలిలోని కళా సమితి ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం ఘనంగా జరుపుకున్నారు. కేరళ మలబార్ చర్చి ఫాదర్ రెవరండ్ జోఫీ చిర యాత్ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం కేరళ నుంచి వచ్చిన ఆర్కెస్ట్రా క్రీస్తు స్తుతి గీతాలు ఆలపించారు. క్రీస్తు జనన వృత్తాంతాన్ని తెలుపుతూ ఏర్పాటు చేసిన అలంకరణ ఆకట్టుకుంది. నగరంలోని కేరళీయులందరూ తరలివచ్చి సందడి చేశారు. కార్యక్రమంలో కేరళ కళా సమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ఎం పిళ్లై, కె.హరిదాస్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం వైఎస్ జగన్‌తోనే సాధ్యం



అప్పన్న ఆలయంలో కరుణాకరరెడ్డి

సింహాచలం: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలతో పాటు అగ్రవర్ణ పేదలను కూడా ఆదుకుంటున్న ఏకైక ముఖ్యమంత్రిగా వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలుస్తారని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకరరెడ్డి తెలిపారు. సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని ఆదివారం ఆయన దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏరాష్ట్రంలోను లేని సంక్షేమ పథకాలను రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేష్ల అమల్లో కేంద్ర ప్రభుత్వం విధించిన నిబంధనలను సరళీకృతం చేసి రాష్ట్రంలో రూ. 8లక్షల ఆదాయ పరిమితి పెట్టడం హర్షణీయమన్నారు.

ఇస్కాన్‌లో వైభవంగా పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజలు వైభవంగా జరిగాయి. శ్రీ రాధాదామోదరులను ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం పూజలు నిర్వహించారు. హరే రామ హరే కృష్ణ కీర్తనలు, అభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.